# కన్నీటి కెరటాలు

విద్వాన్ మల్లాది సత్యనారాయణ



మూర్తి (గోరీముందు మోకరిల్లి కన్నీరు కారుస్తూ): నిండు చందురుని పండు వెన్నెలతో పందెంవేసి గెల్చుకుని నా హృదయమంతా నిండిన నీ నవ్వు వెన్నెలలు మాటిమాటికీ జ్ఞప్తికివచ్చి 'నీ సుశీలోకానికి చచ్చిపోయింది కాని నీ హృదయానికి చచ్చిపోలేదు' అని హెచ్చరిస్తున్నాయి, సుశీ. చిరునవ్వు చిందులాడే నీ మోము ఈ గోరీలో నాకు స్పష్టంగా గోచరిస్తూంది సుశీ!

నువ్వు చచ్చిపోలేదు. బ్రతికే ఉన్నావు.

గోపాలరావు:— (ప్రవేశించి) మూర్తీ! నీ వెర్రేగాని సుశీ బ్రతికుండడమేమిటి? మనస్సు పాడుచేసుకోకు.

మూర్తి:— కాదు బాబూ! సుశీ చచ్చిపోలేదు.

.............

రసావేశంలో మునిగి తాను రచించిన నాటకాన్ని చదువుతూ గోపి 'నా సుశీ చచ్చిపోలేదు, నా సుశీ చచ్చిపోలేదు' అని అరిచాడు. కన్నీరు కారుస్తున్నాడు.

నడుం వంగిపోయి శరీరం ముడతలు పడి ఎముకలు మాత్రమే మిగిలిఉన్న తొంభైయేళ్ళ తాతయ్య కర్ర ఆసరాతో దగ్గుకుంటూ వచ్చి గోపీని పట్టుకున్నాడు. "లేదు బాబూ! నీ సుశీ చచ్చిపోలేదు" అంటున్నాడు వణుకుతూ.

గోపీ సిగ్గుపడ్డాడు. "లేదులే తాతయ్యా!" అన్నాడు.

"ఏమిటి బాబూ ఇది? పోయిన వాళ్ళతో మనమూ పోతామా? ఏదో నాటకం రాశావు. అస్తమానమూ ఎందుకు దాన్ని చదవడం? చదివి చేజారిన వస్తువును జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఎందుకు ఆవేదనలో మునగడం?" అన్నాడు తాతయ్య మనవణ్ణి బుజ్జగిస్తూ.

"అంతకు తప్ప నేను చేయగలిగిందేముంది తాతయ్యా!" అన్నాడు శూన్యంలోకి చూస్తూ గోపి.

సుశీ గోపీల అంతర్యాలు అర్థంచేసుకున్న ఆ తాతయ్య మాట్లాడలేకపోయాడు.

"ఇందులోనే ఏదో ఆనందం... అంతులేని అనుభూతి...బాధానివారణ ఉన్నాయనితోస్తూంది తాతయ్యా!" మాట్లాడలేదు తాతయ్య.

"తాతయ్యా!"

మాట్లాడక కన్నీరు కారుస్తూ తాతయ్య గోడనున్న తన కొడుకు ఫోటో వద్దకు వెళ్ళి చూస్తున్నాడు.

తానూ వెళ్ళాడు తండ్రి ఫోటోవద్దకు. క్షణకాలం తండ్రి కళ్ళల్లోకి చూచాడు. నైరాశ్యం తప్ప మరేమీ గోచరించలేదు గోపీకి. వెనుతిరిగాడు.

ఒక స్త్రీమూర్తి.

నిర్ఘాంతపోయాడు గోపి.

గోపీకి నమస్కారం చేసింది ఆ స్త్రీమూర్తి.

ప్రతి నమస్కారం చేశాడు గోపి.

"మీరు.."ఏదో అడగబోయి సందేహించాడు.

"అదేమిటి గోపీ! నన్నెరగవూ?"

గొంతుకా? ఎప్పుడో విన్నదే.

రూపమా? ఎప్పుడో చూచినదే.

కాని గుర్తుకు రావడంలేదు గోపీకి.

"నా పేరు పద్మ. మనిద్దరం బి.ఏ.లో క్లాస్‌మేట్సుము కదూ?"

"అవునవును. పద్మావతి కదూ నీ పేరు?"

"అవును. కాలం పెరిగిన కొద్దీ పేరు కొంచెం కట్‌చేసి పద్మ అనే ఉంచాను."

*హృదయం అర్పణచేసేశక్తి ఒక్కరి సొమ్ముకాదు. ప్రేమించేవారు వివక్షణ ఎరుగరు. కనుకనే ప్రేమ గ్రుడ్డిది. అందునా భగ్నప్రేమికులకు హృదయం అర్పించకుండా ఉండగలగడం ఆర్ద్ర మనస్కులకు చేతకాదు. జీవితంలో వెనుకకు తీసుకొనేది ఏమీలేదని, అసాధ్యమని తెలుసుకొన్నా మిగిలేదేమిటి?*

"ఏం చేస్తున్నావిప్పుడు?"

"బి. ఏ., బి. యల్ ప్యాసయ్యాను. ఇంకా బోర్డు కట్టలేదు."

"సరిసరి. నాస్నేహితురాలుఒకావిడ ప్లీడరుపట్టా పుచ్చుకుందన్నమాట. నాకు అవసరమైతే ఫీజు లేకుండానే వాదిస్తారన్నమాట."

"తప్పకుండా."

"చూస్తాగా ఎంతవరకు మాట నిలబెట్టుకుంటారో. అయినా ఈ పూరికొంపలో వెర్రిమొర్రి కథలు, నాటకాలు రాసుకునే నాకు కోర్టులతోను, ప్లీడర్లతోను పనేమిటి?"

"అల్లాగనకు గోపీ! బంగారు పళ్ళానికయినా గోడచేరుపు కావాలి. ఏమో! ఏ వేళకు ఏం అవసర మొస్తుందో. సరేగాని నిన్ను కొన్ని ప్రశ్న లడిగి నాకు నూతనంగా కలిగిన ధర్మ సందేహాలు తీర్చుకుందామని వచ్చాను."

"నన్నా!" ఆశ్చర్యంతో అడిగాడు గోపీ.

"అవును. నీవు వ్రాసిన కన్నీటి కెరటాలు నాటకం చదివాను. తొందరలోనే ఎవరో చైతన్య కళావనివారు ప్రదర్శిస్తారటగా? నేనూ చూస్తానన్నమాట. సరే. ఆ నాటకం చదివాక నాకేవో సందేహాలు వచ్చి తీర్చుకుందామని వచ్చాను."

"లా అమూలాగ్రంగా చదివిన నీకు నా ఉద్దేశ్యం కావలసి వచ్చిందా?

"అవును!"

"ప్రేమించిన పురుషునికి దూరమైన భారత నారి తన జీవనజ్యోతి ఆరిపోవడానికి సిద్ధమై మిణుకుమిణుకు మనే సమయంలో తాను కోరేది, ఆశించేది ఏమిటో చెప్పగలవా?"

అకస్మాత్తుగా గోపి తల పైకెత్తాడు. పద్మ కళ్ళలోకి తేరిపారజూచాడు.

పద్మకు ఆ చూపులో చూపు ఏకమై ఒక్కసారి శరీరమంతా గగుర్పొడిచింది. గోపీ కళ్ళల్లోకి చూడలేక తలవంచుకుంది.

క్షణకాలం నిశ్శబ్దం.

"ప్రశ్నకు సమాధానం?"

"నాకు తెలియదు పద్మా." "పోనీ మరొక ప్రశ్న. యుగయుగాలుగా తపస్సుచేసినా చచ్చిపోయిన వాళ్ళు లేచిరావడం ఉందా గోపీ?"

"అసలు చచ్చిపోవడం అంటే ఏమిటి?"

"అంటే?"

"అహ! చచ్చిపోయేది ఆత్మా! లేక శరీరమా? అని."

"శరీరమే."

"మరి ఇంకేం? ఆత్మను మనోనేత్రంతో సందర్శించగల మానవుడు చచ్చినవాళ్ళకోసం తపస్సు చెయ్యక్కరలేదుగా?"

మాట్లాడలేక పోయింది పద్మ.

మూకీభావాన్ని సహించలేకపోయాడు గోపి.

"పద్మా!" అన్నాడు మృదువుగా.

"సర్వకాల సర్వావస్థలయందు ప్రేమించిన ప్రియుని సుఖాన్నే కోరుతూ ఉంటుందను కుంటాను చచ్చిపోయిన ప్రియురాలి ఆత్మ" అంది పద్మ, గోపీ ముఖంవంక చూస్తూ.

"కావచ్చు" అన్నాడు ముక్తసరిగా గోపి.



చిత్రం — ఎమ్. శంకర్రావు (అనకాపల్లి)

"స్త్రీకైనా పురుషునికైనా ఒంటరి బ్రతుకులో సుఖం లేదనుకుంటాను" అంది పద్మ సమాధానంకోసం ఆదుర్దాగా నిరీక్షిస్తూ.

"జంట బ్రతుకులలో ప్రశాంతత ఉన్నదని మాత్రం దృఢంగా చెప్పగలవా?"

మాట్లాడలేకపోయింది పద్మ.

నాటకాన్ని చదివి పొందిన రసావేశంలో ఏవేవో మధుర భావాలతో గోపీని చూడాలని బయలు దేరింది పద్మ. తానే ఓడిపోయినట్లుగా బాధ పడింది. ఆ ఒడ్డు ఈ ఒడ్డు ఒరసి ప్రవహించే ఆ గంగానదిని కదలించడం తన శక్యం కాదను కుంది. ఎందుకో గోపి సాన్నిధ్యాన్ని వదలి వెళ్ళడానికి ఆత్మ అంగీకరించడం లేదు. కాని వెళ్ళక తప్పదు.

గోపీతో మాట్లాడిన కొద్ది క్షణాలలోను జీవితంలో ఎన్నడూ అనుభవించని అనుభూతిని, ఆనందాన్ని పొందగలిగింది. కాని చేతి కందుతా యనుకున్న గగన కుసుమాలు గగన కుసుమాల లాగే ఉండిపోయాయి. సునాయాసంగా ఔన్నత్యా న్నందిన హిమాలయ పర్వత శిఖరాలు పద్మ మనోనేత్రంలో లీలగా సంచరించాయి. అంతలోనే

# కన్నీటి కెరటాలు

అంతులేని లోతు కలిగిన మహాసముద్రంలో అట్ట డుగున ఉన్న రత్నాలూ స్పష్టంగా గోచరించాయి.

భావసముద్రంలో మునిగిన గోపి నిశ్చలతకు భంగం కలిగించకూడదనుకుని పద్మ లేచింది.

గోడ ప్రక్కనే కీచురాళ్ళు అరుస్తూనేఉన్నాయి. దూరంగా పొలాల్లో నక్కల అరుపులు విని పిస్తూనే ఉన్నాయి. ఎదురుగా ఉన్న పూరి పాకలో గుర్రం సకిలించింది. గోపి మాత్రం కదలలేదు.

వెనక్కు తిరిగింది పద్మ. కుక్కి మంచంలో తాతయ్య కన్పించాడు. జీవంలేని ఆ కళ్ళల్లో నిరాశ, నిస్పృహ మిగిలాయి. లోకం పోకడను ఆమూలాగ్రంగా అవగతం చేసుకున్న ఆ కళ్ళకు వింతవేదీ లేక నిశ్చలంగా ఉన్నాయి.

కాలాన్ననుసరించి జీవనయాత్రలో జీవి అతి కష్టంమీద ఎక్కుతున్న సోపానాలు, అనుభూతులు, ఆవేదనలు, నిరాశలు, నిస్పృహలు పరిసమాప్తి కాబోయే ముందు కలిగే పరి పూర్ణత పద్మ భావప్రపంచంలో వరసగా గోచరించాయి. ఒక్క నిట్టూర్పు విడిచి వెళ్ళ బోయింది.

"పద్మా!" అన్నాడు గోపి.

వెనక్కు తిరిగింది.

"వెడుతున్నావా?"

"అవును."

"వచ్చినపని చెప్పావు కావు."

"చెప్పడాని కేముంది? ఎంత గాలి వీచినా హిమాలయ పర్వత శిఖరాగ్రాలు చలించక ప్రశాంతంగానే ఉంటాయని తెలుసుకున్నాను. వస్తాను."

"ఏమేమిటో మాట్లాడతావు. నాకొకటీఅర్థం కాదు."

క్షణంసేపు గోపీ వంక చూచి వెళ్ళిపోయింది పద్మ.

తనలో తానే నవ్వుకున్నాడు గోపి. తాతవంక చూచాడు. కునికిపాట్లు పడుతున్నాడు తాతయ్య జీవన పరిసమాప్తిలోని పిలుపుకోసం ఎదురు చూస్తున్నాడు తాతయ్య. వయస్సు సమస్త మమతలను త్రెంచుకుని అరిగడియకోసం ఆరాట పడుతూంది.

"తాతయ్యా!" అన్నాడు గోపి.

కళ్ళు తెరిచాడు తాతయ్య.

"పిలిచావా బాబూ!" అన్నాడు.

"ఆశించిన కుసుమం గగన కుసుమమైంది. అక్కర్లేదనుకున్న కుసుమం ఒళ్లో పడబోతూంది. ఇదేనా తాతయ్యా జీవితం అంటే" అన్నాడు గోపి. గొంతుకలో ఆవేదన, చూపులో నైరాశ్యం నాట్యంచేస్తున్నాయి. "మాట్లాడవేంతాతయ్యా" అన్నాడు.

"బాబూ! దేనిమీద కోర్కెను పెంచు కుంటావో అది తప్పకదూరమౌతుంది. భగవంతుని సృష్టిలో దేని అక్కర్లేదనుకుంటావో అది తప్పక నిన్నే చేరుతుంది. ఇదే జీవిత రహస్యం."

ఆలోచనాసముద్రంలో మునిగిపోయాడు గోపి.

చూపులు శూన్యంలోకి, మనస్సు గతించిన మధుర క్షణాలలోనికి పరుగులెత్తుతున్నాయి.

ఒకనాడు సుశీ అన్న మాటలు జ్ఞాపకానికి వచ్చాయి. 'షాజహాను తాజ్‌మహల్ ఎందుకు కట్టించాడు గోపీ' అంది.

తాను మాట్లాడ లేదు.

సన్నని వ్రేళ్ళను గోపీ ముంగురుల లోనికి పోనిచ్చి కళ్ళల్లో కళ్ళుపెట్టి, "నేను చచ్చిపోతే నా గోరీ మీద ఒక్క కన్నీటి బిందువును రాల్చ గలవా గోపీ" అంది.

తాను సుశీ నోరు మూసేశాడు.

సుశీ కళ్ళు చెమ్మగిల్లాయి.

తాను సుశీ కళ్ళు తుడుస్తూ, "ఏమిటీ మాటలు సుశీ? ఏడుస్తున్నావా?" అన్నాడు.

"లేదు గోపీ! ఆనందబాష్పాలు. నీ హృద యాన్ని చూడగలిగాను. నా హృదయాన్ని నీకు అర్పించాను. జన్మ ధన్యమైందనుకున్నాను. లోకానికి కావలసిన మంగళసూత్రం కట్టే.


నెర్విటాల్

నరముల బలహీనతకున్నూ, రక్త పోటునకున్నూ రామబాణము. అను భవ యుక్తముగా చేయబడినది.

8 ఔ సీసా 5-75 పోస్టేజి 1-75

ఇండియన్ మెడిసిన్ హౌస్,

విజయవాడ-2.

తాంబూలములకు

యాలక్కాయ,లవంగము యిప్పుడు అక్కరలేదు.

రూచి



సుగంధ ద్రవ్య సముదాయము.

పచ్చకర్పూరం, కుంకు పువ్వు చేర్చబడినది.

అన్ని కిరాణా కొట్లలో దొరుకును.

కిళ్లీకొట్లలో వాడబడుచున్నది.

¼ పౌ. రు. 3—25, పోస్టేజి అదనం.

నానాకాన్మటెక్సు, విజయవాడ—2.

రాంతీర్థ బ్రాహ్మీ నూనె

(స్పెషల్ నెం. 1) రిజిష్టర్డు



చుండు, వెంట్రుకలు రాలుట మాన్పి, వెంట్రుకలను పట్టువలె మృదువుగాను, కాంతిగాను నల్లగాను చేయు అమూల్యమైన హెయిర్ టానిక్. ఇది మెదడును చల్లబరచి, జ్ఞాపకశక్తిని పెంపొందించి కండ్ల వేడిమి, నిరంతర శిరోబాధ తగ్గించును. హాయిగా నిద్రపట్టించును.

రాంతీర్థ హెయిరాయిల్ పెద్ద సీసా: రు. 4/50, చిన్నసీసా: 2/25.

యోగాసన చార్టు సచిత్రమైన మా యోగాసన చిత్రపటంలో చూపిన వివిధ యోగాసనముల నిరంతర అభ్యాసము వల్ల ఆరోగ్యకరమైన మంచి శరీరదార్ఢ్యత పొందండి.

పోస్టేజితో ధర రు. 3/—లు మాత్రమే.

శ్రీ రాంతీర్థ యోగాశ్రం

దాదర్, బొంబాయి—14.

సమయం రాకపోయినా, ఆ భగవంతుడు నిలు
వెల్లార్పకపోయినా నా ఆరాధన దైవం నీవేనని
మనస్ఫూర్తిగా నమ్మాను....గోపీ."

అంటూ గోపీ ముఖాన్ని తన రెండు చేతుల
లోనికి తీసుకుంది. ఆనందంలో తల మునకలైన
గోపీతో మళ్ళీ చెబుతోంది:

"గోపీ! అనుక్షణమూ ఏదో పిలుపు నాకు
వినిపిస్తోంది. ఈ ప్రేమ మాధుర్యంలోనే
ఏ ఆటంకం రాకుండా నా జీవిత సమాప్తి అయితే
బాగుండుననే ఆకాంక్ష నూతనంగా ఉద్భ
విస్తోంది ఎందుకో. అలా జరిగితే....."

వినలేకపోయాడు గోపి. 'సుశీ' అని అరిచాడు.
నోరు మూసేశాడు. గట్టిగా హృదయానికి
హత్తుకున్నాడు. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.
గొంతు మూగవోయింది. మాటలు పెగలలేదు.
కన్నీరు సుశీ తలను సంపూర్ణంగా తడిపింది.

భగవంతుడు చూడలేకపోయాడు. ఏకమనస్సుగా
మారిన ఆ రెండు శరీరాలను విడదీశాడు.
సుశీని ఈ లోకంనుంచి దూరం చేశాడు. ఆ
రోజు శుక్రవారం.

ప్రతి శుక్రవారం నిశ్చయంగా మేల్కొనడమే
కన్నీటితో మేల్కొంటాడు గోపి. దొరికినన్ని
పువ్వులు కోస్తాడు. సుశీ గోరీ దగ్గరకు వెడతాడు.
కన్నీటితో గోరీని కడుగుతాడు. పుష్పంతో
పూజిస్తాడు. మధురానుభవాలు ఒకటి వెంబడి
ఒకటి వరుసగా జ్ఞాపకం వస్తాయి. తనలో తానే
నవ్వుకుంటాడు. తనలో తానే ఏడుస్తాడు.
శూన్యంలోకి గంటల తరబడి చూస్తాడు. ఆ
గోరీ మీదే పడుకుంటాడు. సూర్యాస్తమయం
దాకా ఎవరితోనూ మాట్లాడడు. చివరకు తాతయ్య
వచ్చి ఇంటికి తీసుకు పోతాడు. ప్రతి శుక్ర
వారం కటిక ఉపవాసం. మంచినీళ్ళు కూడా
త్రాగడు. మౌనముద్ర వీడదు. మనస్సు సుశీ
మీదే లగ్నం చేస్తాడు.

సుశీని కథానాయికగా చేసి తానే కథానాయ
కుడుగా మూర్తి అనే పేరు పెట్టుకొని జరిగిన
ఘట్టాన్ని జరిగినట్లే నాటకంగా వ్రాశాడు. నాటకం
వ్రాస్తూనే రాత్రింబవళ్ళు ఏడ్చేవాడు. వ్రాసింది
చదువుకుంటూ ఏడుపులోనే నవ్వేవాడు.

ఆ నాటక ప్రదర్శనంకోసం అతని హృదయం
తహతహలాడుతూంది. అంతేనా ఆ రచయితకు,
ఆ భగ్న ప్రేమికునకు కావలసిన దేమున్నది.

## 2

ఆ రోజు 'కన్నీటి కెరటాలు' నాటకం
చైతన్య కళాసమితివారు ప్రదర్శించబోతున్నారు.
తనకు ప్రత్యేక ఆహ్వానం వచ్చింది. వెడతాడు.
నాటకాన్ని ప్రదర్శిస్తారు. తాను చూస్తాడు.
రచయితకు సన్మానం చేస్తారు. తనకా
......తా నెవరు సన్మానం పొందడానికి......ఈ
నాటకాన్ని ఎవరు రచించారు? తాను కాదు. తాను
అర్ధాంగిగా స్వీకరించాలని తలంచిన సుశీ ఆత్మ తన
కలంలో ప్రవేశించి ఈనాటకం వ్రాయించింది. అంతే
గాని తనకేం తెలుసు? సుశీతో తాను కలిసి ఉన్న
మధుర క్షణాలోని సుశీ పలుకులనే కాగితంమీద



అందానికి మెరుగు ఫోటో — కె. ఎస్. సోమసుందరం (బెంగుళూరు-18)

పెట్టాడు. ఇందులో తన ప్రతిభ ఏముంది?
నాటక రచయిత్రి సుశీ. తాను కాదు. నాటక
రచనలో ఏమైనా పేరు ప్రతిష్ఠలు వస్తే అవి
సుశీవి. తనవి కావు. తన వెనువెంటనే ఉండి
నవ్వించి కవ్వించి నాటకాన్ని వ్రాయించింది.

ఈ మధుర భావన గోపీ మనస్సులోనికి వచ్చిన
కొద్దిసేపట్లో బరువెక్కిన హృదయం తేలిక
పడింది. రెప్పవాల్చకుండా శూన్యంలోనికి చూస్తు
న్నాడు.

తన వెనుకనుంచి వచ్చిన ఒక చేతిలోని 'కన్నీటి
కెరటాలు' నాటకం టిక్కెట్టు తన కళ్ళముందు
కనిపించింది. 'సుశీ' అని చెయ్యి పట్టుకున్నాడు.

ఆపాదమస్తకం పులకితమైంది పద్మకు.

వెనుదిరిగాడు గోపి. పద్మ ఖిన్నురాలై తల
వంచుకుంది. ఆ క్షణంలో తాను సుశీ కాలేక
పోయాను గదా అని కించబడింది. సుశీ జీవితం
ధన్యమైందని జోహార్లు అర్పించింది మనస్సులో.

దిగ్భ్రాంతుడయ్యాడు గోపి. చెయ్యి వదిలాడు.
తన పొరబాటుకు నొచ్చుకున్నాడు.

కాస్సేపు నిశ్శబ్దం. ఇద్దరూ మాట్లాడుకో
లేదు.

పద్మ చొరవ చేసింది. "ఇద్దరికీ టిక్కెట్లు
రిజర్వు చేశాను. రాత్రి నాటకానికి వెడదాం"
అని చెప్పి ఇంకా అక్కడ ఉండి గోపీ మధుర
భావనా పరంపరకు అడ్డు తగలడం ఇష్టంలేక
వెళ్ళిపోయింది.

రాత్రి మరల వచ్చింది. చైతన్య రహితుడైన
గోపీని నాటకానికి తీసుకువెళ్ళింది. ఇద్దరూ
కూర్చున్నారు. మౌనముద్ర దాల్చిన గోపీకి భంగం
కలిగించడం తనకు ఇష్టంలేక పద్మ పలకరించ
లేదు.

నాటకం మొదలుపెట్టారు.

సుశీ పాత్రధారిణి రసానుభూతితో పలికే
ప్రతిమాటాగోపీ గుండెలను బ్రద్దలు చేస్తోంది.
గడచిన మధుర క్షణాలు జ్ఞప్తికి వస్తున్నాయి.
వలవల ఏడుస్తున్నాడు. పద్మ కనిపెడుతూనే
ఉంది. ఆమె హృదయం కూడా నాటక రచనా
శిల్పానికి జోహార్లు అర్పిస్తోంది.

నాటకం మధ్యలో ఎవరో పెద్దలు లేవడం,
నాటకాన్ని గురించి చెప్పడం జరిగిన తదుపరి
రచయితకు సన్మానం అన్నారు. నేను కాదని,
సుశీ అని, చెబుదా మనుకున్నాడు గోపి. చైతన్య
కళావని ప్రొప్రయిటరు జగన్నాథం స్టేజిమీదకు
వచ్చాడు. ప్రెసిడెంటుగారు లేచి "ఈ నాటకాన్ని
ఇంత బాగా రచించిన శ్రీ జగన్నాథంగారికి నా
హృదయపూర్వక ధన్యవాదాలు అర్పిస్తున్నా"నని
పూలదండ జగన్నాథంగారి మెడలో వేశాడు.
హాలంతా చప్పట్లతో దద్దరిల్లింది.

హాలులోని ప్రతి జీవీ నాటక రచనకు ఉప్పొంగి
చప్పట్లు చరిచారు. రసానుభూతిలో ముంచెత్తిన
నాయికీ నాయకుల నటనలో లీనమయిన గోపి
కళ్ళు మూసుకుని చైతన్యరహితు డయ్యాడు.

కాని జరిగిన అన్యాయానికి, మోసానికి బాధ
పడుతూంది పద్మ.

జగన్నాథం నాటక రచన విషయంలో తా
నెంతో కష్టపడ్డానని తన రచనా సౌలభ్యాన్ని
మెచ్చుకొనిన ప్రేక్షక లోకానికి ధన్యవాదాలని
చెప్పుకున్నాడు.

మరల నాటకం జరుగుతూంది.

మధ్యలో పద్మ ప్రక్కకు తిరిగింది. గోపీ లేడు. ఏమయ్యాడు? ఇంటికి వెళ్ళిపోయా డనుకుంది. సరాసరి గోపి ఇంటికి వచ్చింది. వరున్నాడు గోపి.

"ఏమిటి పద్మా! ఇలా వచ్చావు" అన్నాడు.

"ఏమిటే అన్యాయం?"

"అన్యాయాని కేముంది?"

"నీవు రాసిన నాటకాన్ని తన నాటకం అని చెప్పుకుంటాడు ఆ జగన్నాథానికి సిగ్గెల్లా లేదో."

"పోనీలే పద్మా! ఎవరు రాసిందని చెప్పుకుంటే ఏముంది? ఏ అనుభూతికోసం నాటకం రాశానో దాన్ని పొందగలిగాను. అదే నా కానందం. అంతే నాక్కావలసింది" అన్నాడు గోపి.

"గోపీ! నువ్వేమన్నా సరేగాని ఆ జగన్నాథం చేసిన ఈపాడు పనికి నే నంగీకరించను. నా మిత్రుడు గోపి ఈ నాటకాన్ని రాశాడని లోకానికి చాటేవరకు నాకు నిద్ర పట్టదు."

"అందువల్ల నాకు వచ్చే లాభ మేమిటి? జగన్నాథానికి వచ్చే నష్టం ఏమిటి?"

"అదేమో నాకు తెలియదు. నా యీ కార్యక్రమానికి మాత్రం అడ్డురాకు. నేను లా ప్యాస య్యాను. కాని ఒక్కటి మాత్రం మరచిపోకు. ఈ విషయంలో నీమీదకు ఏ మొచ్చినా నిమిత్తమాత్రుడవుగా నువ్వు అనుభవించు. ఆ పైన కార్యక్రమం అంతా నేను చూచుకుంటాను" అంటూనే పద్మ వెళ్ళిపోయింది.

నాటక ప్రదర్శనం జరిగి వారం రోజు లయింది. ఈ వారం రోజులు గోపి పరధ్యానం లోనే ఉన్నాడు. భోజనానికి ఇష్టపడడు. శుష్కించాడు. మాటి మాటికీ ఏదో పిలుపు తనకు విని పిస్తూం దంటాడు. ఎవరో తనకోసం ఏడుస్తూ నిరీక్షిస్తున్నారంటాడు. మనవడి ఆవేదన చూచి తాతయ్య బాధపడతాడు.

ఒక రోజున జగన్నాథం పోలీసులతో వచ్చాడు. సబ్ ఇన్‌స్పెక్టరు గోపీని అరెస్టు చేస్తున్నాడు. ఎందుకని అడగలేదు గోపి. పద్మ చెప్పిన మాటలు జ్ఞాపకానికి వచ్చాయి. నిమిత్తమాత్రుడుగానే రెండు చేతులు సంకెళ్ళకు అందించాడు.

"ఏం చేశాడని బాబూ ఈ సంకెళ్ళు" అన్నాడు వణుకుతూ నిర్ఘాంతపోయిన తాతయ్య.

'ఏం చేశాడో రేపు కోర్టులో తెలుస్తుంది" అని గద్దించాడు జగన్నాథం.

"నువ్వూరుకో తాతయ్యా! నన్ను సుశీ పిలుస్తూంది. ఎవళ్ళు ఎక్కడికి తీసుకువెళ్ళినా నేను త్వరలోనే సుశీ దగ్గరకు వెళ్ళిపోతాను."

"బాబూ" అని కౌగిలించుకున్నాడు తాతయ్య.

ఆ వృద్ధుని కౌగిలిలోంచి గోపీని లాక్కుపోయారు ఎర్రటోపీలవాళ్ళు.

'బాబూ' అని రెండవసారి అరుస్తూ ముందు పడిపోయాడు తాతయ్య. దూరంగా తీతువుపిట్ట అరిచింది. ఆ పూరి పాకమీదవాలిన ముసలి గ్రద్ద రెక్కలు టపటప లాడిస్తూ లేచిపోయి అనంతాకాశంలోనికి వెళ్ళిపోయింది.

## 3

'దేవుని ఎదుట......ప్రమాణంచేసి....అంతా

# కన్నీటి కెరటాలు

నిజమే చెబుతాను.....అబద్ధం చెప్పను.'

ప్రమాణం చేయించారు గోపీచేత.

జగన్నాథంగారి ప్లీడరు లేచి "ముద్దాయివైన నీవు నీపై మోపిన అభియోగానికి అంగీకరిస్తావా?" అన్నాడు.

"అభియోగమే తెలియనిదే అంగీకరించడం ఎట్లా?" అన్నాడు గోపి.

జడ్జీగారు ఆశ్చర్యపోయి జగన్నాథం వంక చూచారు.

"వారి అమ్మాయిని నీవు నిర్బంధించి తీసికొని వెళ్ళి తిరుపతిలో పెళ్ళి చేసుకున్నావని నీపైన అభియోగం" అన్నాడు జగన్నాథంగారి ప్లీడరు

నవ్వొచ్చింది గోపీకి. "నా కేమీ తెలియ" దన్నాడు.

జడ్జీగారు కలుగజేసుకుని అడిగారు—

"నీ పేరు గోపీకదూ?"

"అవునండి."

"నీవు రచయితవని విన్నాను."

"ఏవో చిన్నచిన్న కథలు, ఒకేఒక నాటకం..."

ఆగిపోయాడు మధ్యలో గోపి.

"ఊ! నాటకం?"

"ఏమీలేదు. నేను కాదు వ్రాసింది."

"మరి?"

"నా సుశీ రాయించింది నాచేత."

"సుశీ అంటే?"

"సుశీ అంటే ఏం చెప్పను? నా కేమీ కాదు. నాకన్నీ అవుతుంది."

అర్థం కాలేదు జడ్జీగారికి.

"ఇంతకూ నీమీద మోపబడిన ఈ అభియోగంలోని సత్యాసత్యాలు వాదించే నిమిత్తం నీ కెవరూ ప్లీడరు లేరా?"

"లేరు."

"యువరానర్ సార్! నేను గోపి తరపున వాదించడానికే వచ్చాను" అన్నాడు న్యాయస్థానంలోనికి ప్రవేశిస్తున్న ఒక నల్లకళ్ళద్దాలతోను, ప్లీడరు దుస్తులలోను ఉన్న ఒక నూతన యువకుడు.

"మీరు....." అని సందేహించారు జడ్జీగారు.

"సందేహించకండి. నే నీ కోర్టుకు క్రొత్తవాడినే. ఇదిగో నాకున్న హక్కు" అని జడ్జీగారి కందించాడేదో ఆ నూతన యువకుడు.

చూచి నవ్వుకున్నాడు జడ్జి.

"మీ వాదన ప్రారంభించవచ్చు" అన్నారు.

నూతన యువకుడు ప్రారంభించాడు:

> *చక్కగా మాట్లాడలేని పలువురు అధికంగా ప్రసంగిస్తారు.*
>
> —సామెత

"జగన్నాథంగారి కన్యను గోపీ అపహరించాడని అభియోగం. అయితే యీ సందర్భంలో జగన్నాథంగారిని కొన్ని ప్రశ్నలడగాలి."

జగన్నాథంగారిని బోను ఎక్కించారు. ప్రమాణం చేయించారు.

"మీ అమ్మాయిని గోపీ అపహరించినట్లు సాక్ష్యం ఏమిటండీ?"

"మా అమ్మాయి వ్రాసిన ఉత్తరం."

"ఏదీ ఆ ఉత్తరం?"

జగన్నాథం తన ప్లీడరు వంక చూచాడు.

ప్లీడరు లేచి, "ఆ ఉత్తరంలో తన బాధలన్నీ వ్రాసింది. అది కోర్టులో పెట్టడం వారికుటుంబ గౌరవానికి భంగం" అన్నాడు.

"పాపం మీ అమ్మాయిని అపహరించినందుకు మీ రెంతో బాధపడి ఉంటారు" అన్నాడు నూతన యువకుడు జగన్నాథం వంక తిరిగి.

"ఆ బాధ మీలాంటి యువకుల కేం తెలుస్తుంది?" అన్నాడు జగన్నాథం.

"అవునవును. అష్టకష్టాలూ పడి అల్లారు ముద్దుగా పెంచిన బిడ్డను పరాయివాడు ఎత్తుకు పోతే ఎంత బాధ!"

"అవును."

"ఒక రచయిత అహోరాత్రాలు కష్టపడి మన స్సంతా పాడుచేసుకుని వ్రాసుకున్న కావ్యకన్యకను పరాయివాడు అపహరిస్తే ఎంత బాధ పడతాడో అంతకన్న ఎక్కువ బాధే పడిఉంటారు."

"ఏమిటి మీరు మాట్లాడేది?"

"మీ విషయమే."

"మర్యాద నతిక్రమిస్తున్నారు."

"అప్పుడే ఏమైంది? ఎవరి మర్యాదలు ఎంత వరకు ఉన్నాయో నిర్ణయించేది కోర్టువారు. ముద్దాయి తరపున వకీల్ను నేను. నే నడిగిన ప్రశ్నలకు మీరు సమాధానం చెప్పాలి. మీరు వారం పది రోజులక్రితం ఒక నాటకం ఆడారు కదూ?"

"అవును."

"పేరు?"

"కన్నీటి కెరటాలు."

"ఆ నాటక రచయిత ఎవరో సెలవిస్తారా?"

"నేనే."

"అని సన్మానం చేయించుకున్నారు లెండి. మనలో మనమాట. రచయిత మీరేనా అని?"

"మీమీద పరువు నష్టానికి దావా వెయ్యవలసి ఉంటుంది" అన్నాడు జగన్నాథం పట్టరాని ఆవేశంతో.

"ఎంతకో చెప్పారు కాదు దావా?" నవ్వుతూ అన్నాడు నూతన యువకుడు.

కంగారు పడుతున్నాడు జగన్నాథం.

"కంగారు పడకండి జగన్నాథంగారూ! గోపి రచించి ప్రదర్శించమని యిచ్చిన నాటకాన్ని మీ పేరుతో ప్రదర్శించి సన్మానం చేయించుకున్నారు. అంటే గోపీ తాలూకు కావ్యకన్యకను చూస్తూ చూస్తూ అపహరించేశారు."

"దీనికి సాక్ష్యం?"

"గోపి తన నాటకాన్ని మీవద్దకు తీసుకువచ్చి నప్పుడు మీ కిద్దరికీ జరిగిన సంభాషణ."

"ఏమిటా సంభాషణ?"

"నాకు జ్ఞాపకశక్తి తగ్గిపోయింది. నాదగ్గర ఉన్న టేప్ రికార్డుకు జ్ఞాపకశక్తి ఎక్కువ. అదే చెబుతుంది. వినండి" అని టేపు రికార్డరు తీసి స్విచ్ ఆన్ చేశాడు.

"నేను రాసిన యీ కన్నీటి కెరటాలు నాటకాన్ని ప్రదర్శిస్తే చూచి ఆనందిద్దామని."

"ఓ! తప్పక ప్రదర్శిస్తాము. మీ కెంతో పేరు తీసుకువస్తాను."

టేప్ రికార్డరు స్విచ్ నొక్కేశాడు నూతన యువకుడు—"చాలనుకుంటాను సాక్ష్యం" అంటూ.

మాట్లాడక తల వంచుకున్నాడు జగన్నాథం.

మళ్ళీ మొదలుపెట్టాడు నూతన యువకుడు.

"గోపీ కష్టపడి వ్రాసుకున్న కావ్యకన్యను అపహరించారు జగన్నాథంగారు. జగన్నాథంగారి కడుపున పుట్టిన కన్యను అపహరించి పెళ్ళి చేసుకున్నాడు గోపి. ఇద్దరూ కన్యలను అపహరించిన వారే. అయితే ఇంతకూ గోపి జగన్నాథంగారి కన్యను అపహరించాడో లేక ఆమే గోపిని అపహరించిందో ఆమె వ్రాసిన ఉత్తరం కోర్టు వారి సముఖానికి వస్తేనేగాని తేలదు.

"ఇంతకూ వీరి అమ్మాయి వీరికి జ్ఞాన ప్రబోధాన్ని అందివ్వడానికే యీ పని చేసిఉంటుంది. వీరిరువురకూ వివాహం జరిగిఉండదు. తన కన్యను అపహరించారనే వరికి తన కెంత కష్టం కలిగిందో గోపీ కావ్య కన్యను తా నపహరించినపుడు గోపీకి అంత కష్టం కలిగి ఉంటుందని తెలియజేయడానికే యీ పని చేసి ఉంటుంది. వారి సంభాషణలు టేప్ రికార్డు చేయడానికి, ఇప్పుడు ఈ నాటకం ఆడడానికి కారణం తండ్రిలో పరివర్తన కలుగజేయడం కోసమే అయిఉండాలి. ఇప్పటికైనా పశ్చాత్తాప పడి జగన్నాథంగారు చేసిన తప్పు దిద్దుకోవడం మంచిది. ఆలస్యమైతే జరిగే దుష్ఫలితాలకు తానే కారకుడనని జీవితాంతం బాధపడవలసి వస్తుంది" అని ధైర్యంగా జగన్నాథం వంక చూచాడు నూతన యువకుడు.

జగన్నాథం తలవంచుకుని, "నా అభియోగాన్ని నేను వదులుకుంటున్నాను. కోర్టువారు క్షమిస్తారని ఆశిస్తున్నాను" అని బోను దిగాడు.

లోగడ ఆ నాటక ప్రదర్శనాన్ని చూచి ఉన్న జడ్జీగారు ఇప్పుడు సర్వం విశదం కాగానే గోపీని తన గదికి తీసుకువెళ్ళాడు. రచనా నైపుణ్యానికి ఎంతగానో అభినందించాడు. నిమిత్తమాత్రుడుగానే స్వీకరించాడు గోపి. బయటకు వచ్చాడు. తనకై వాదించిన ప్లీడరుగారు కనిపిస్తారేమో ధన్యవాదా లర్పిద్దామని చూచాడు. కాని కనపడ లేదు.

అంతలో ఆరోజు శుక్రవారం అని జ్ఞాపకం వచ్చింది. తన సుశీ చేతులు చాచి పిలుస్తున్నట్లు యింది. శూన్యంలోనికి చూడు. సుశీ అని అరిచాడు.

పరుగెత్తుతున్నాడు గోపి.

సుశీ గోరీని చేరుకున్నాడు.

కన్నీటితో గోరీకి అభిషేకం చేశాడు.

"ఈ రోజు నీకు పువ్వులుతీసుకు రాలేక పోయాను సుశీ" అన్నాడు ఆవేదనాపూరితమైన కంఠంతో.

వెనుకనే నిలుచుండి ఈ మాటలు విన్న ఆ నూతన ప్లీడరు పువ్వులకోసం పరుగెత్తాడు.

రెప్పపాటు లేకుండా శూన్యంలోనికి చూస్తూ అలాగే ఉండిపోయాడు. గోపి.

ఇంతలో ఎవరో 'గోపీ' అని పిలిచినట్టయింది.

నలుప్రక్కలా చూచాడు గోపీ. ఎవరూ లేరు.

మరల పిలుపు వినిపించింది.

బాగా సన్నిహితమైన గొంతుక.

నిదానించాడు.

గోరీలోనుంచి వినిపిస్తూంది పిలుపు.

అవును అది సుశీ గొంతు. పిలుస్తూంది అని గోరీ వంక పరీక్షగా చూస్తున్నాడు గోపి.

మరల గోపీ అని పిలుపు.

సుశీ అని పిలుద్దామనుకుంటాడు గోపీ.

నోరు పెగలడంలేదు.

అలాగే చూస్తున్నాడు గోరీలోనికి.

గోరీలో అస్పష్టంగా కనిపిస్తూంది సుశీ.

కన్నీరు కారుస్తూంది సుశీ.

దుఃఖం పొర్లి పొర్లి వస్తూంది ఆ దృశ్యాన్ని చూచిన గోపీకి.

ఆవేదన, ఆనందం సమపాళ్ళలో కట్టలు త్రెంచుకు ప్రవహిస్తున్నాయి గోపీకి.

ఆవేదనతో ఏడుద్దామనుకున్నా ఆనందంతో నవ్వుదామనుకున్నా నోరు పెగలడంలేదు.

రెప్ప వాల్చకుండా చూస్తున్నాడు గోపీ.

చిక్కి శల్యమైంది సుశీ.

ఆ కన్నులలోని ఆనాటి అందం ఆనందం యేమైనాయి?

అంతకంతకు దగ్గరకు వస్తూంది సుశీ యేడుస్తూ.

సుశీతోపాటు ఏదో పెద్ద కాంతి కూడా వచ్చి, గోపీకళ్ళను కప్పివేస్తూంది.

అంతకంతకు సుశీ దగ్గరకు వస్తూంది చేతులు చాచి.

అంతకంతకు భరించరాని ఆ కాంతి పుంజాలు గోపీ కళ్ళకు దృష్టి శూన్యాన్ని కలుగజేస్తున్నాయి.

తన శరీరం తన స్వాధీనం తప్పుతూంది.


కాంతి పుంజాలు చూడలేకపోతున్నాడు.

సుశీ దగ్గరకు వచ్చేసింది.

గోపీని కౌగిలించుకుంది.

'ఈ అనుభూతి నాకు శాశ్వతంచెయ్యవూ' అని అడుగుతూ దీనంగా సుశీవంక చూస్తూ ఉండి పోయాడు గోపి. చైతన్య రహితుడయ్యాడు.

ఇంతలో పువ్వులకోసం వెళ్ళిన ప్లీడరుగారు పువ్వులతో వచ్చాడు.



శివ పార్వతులు

ఫోటో — ఓ. త్రినాథ్ (కటక్—1)

'కన్నీటి కెరటాలు' నాటకం తీసుకుని పరుగెత్తుకుంటూ వచ్చిన జగన్నాథం వీరిద్దర్నీ చూచి గోరీ వెనకాల దాగాడు.

ప్లీడరుగారు గోపీతో పువ్వులు తెచ్చానన్నాడు.

గోపీ మాట్లాడలేదు.

'నీ సుశీ పూజకోసం పువ్వులు తెచ్చా' నన్నాడు మళ్ళీ.

గోపీ మాట్లాడలేదు.

ప్లీడరుగారు కంగారుపడి గోపీని కదిపారు.

ఇంకేముంది ?

క్షణం క్రిందటే గోపీ ఆత్మ సుశీ ఆత్మతో కలిసిపోయి అనంతవాయువులో ఆనందంగా విహారం చేస్తూంది.

కట్టె మాత్రం ఇక్కడ మిగిలింది.

కళ్ళు చెమ్మగిల్లాయి ప్లీడరుగారికి.

గోపీని పరుండబెట్టాడు ఆ గోరీమీదే.

తలకున్న తలపాగ, కళ్ళజోడు, కోటుతీసి అక్కడ పెట్టాడు.

ఆశ్చర్యపోయాడు జగన్నాథం.

ప్లీడరు కాదు.....పద్మ...తన కూతురు పద్మ.

అదృష్టవంతురాలైన సుశీకి శుక్రవారం పూజకు అడ్డం రాకుండా పువ్వులు తెద్దామని వెళ్లి తెచ్చిన పద్మ రెండు కన్నీటి బిందువులతోసహా ఆ పుష్పాలను గోపీమీద విడిచిపెట్టింది.

ఇదంతా చూస్తున్న జగన్నాథానికి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. గోరీ చాటునుండి బయటికి వచ్చాడు.

'కన్నీటి కెరటాలు' కావ్యకన్యకను గోపీ హృదయంమీద పెడుతూ కన్నీటితో "ఇది నీవు రచించినదే నేను కాదు. నన్ను క్షమించు" అన్నాడు జగన్నాథం.

రచించినది నేను కాదు నా సుశీ అన్న భావాన్ని వెళ్ళగక్కుతూ కదలికలేక నిర్జీవమైన ఆ గోపీ కళ్ళు సుశీన్నే గోరీ శిఖరాగ్రానికే చూపిస్తున్నాయి. ★